# భారత పౌరసత్వం పొందేదెలా

**రాచరిక వ్యవస్థలో పాలకులు, పాలితులుండేవారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలితులు పౌరులయ్యారు. రాజ్యంలో సభ్యత్వం కలిగి, చట్టపరమైన హక్కులు అనుభవిస్తూ.. బాధ్యతలు నిర్వహించే వ్యక్తులే పౌరులు. పౌరులకు రాజకీయ, పౌరహక్కులు లభిస్తే.. విదేశీయులకు కొన్ని పరిమితులుంటాయి!!**

రాజ్యాంగ పరిషత్‌లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన రాజ్యాంగ లక్ష్యాల తీర్మానమే, స్వల్ప మార్పులతో మన రాజ్యాంగానికి పీఠిక అయింది. 1949, అక్టోబరు 17న పీఠికను రాజ్యాంగంలో అంతర్భాగంగా ఆమోదించారు. 'భారత ప్రజలమైన మనం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర వ్యవస్థనేర్పరచుకుని తద్వారా పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వాన్ని అందించి సౌభ్రాతృత్వ భావనను పెంపొందిస్తాం. రాజ్యాంగ అంతిమ లక్ష్యం 'వ్యక్తి మాన్యతను, జాతి ఐక్యతను పెంపొందించడం' అని పేర్కొన్నారు. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 'సమాఖ్య, లౌకిక, సమగ్రత' అనే పదాలను చేర్చారు. రాజ్యాంగ నిర్మాతలు బలంగా విశ్వసించిన ప్రధాన విలువలను పీఠిక ప్రతిబింబిస్తుంది. ఇది భారత రాజకీయ వ్యవస్థ స్వభావాన్ని, లక్ష్యాలను వివరిస్తుంది. సర్వసత్తాక, లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ (స్వభావం).. పౌరులందరికీ అన్నిరంగాల్లో న్యాయం, స్వేచ్ఛను, సమానత్వాన్ని అందించడం ద్వారా సర్వమానవ సౌభ్రాతృత్వానికి కృషి చేస్తోంది.

## పౌరసత్వం:

పౌరసత్వాన్ని రాజ్యాంగంలోని రెండో భాగంలో ప్రస్తావించారు. రాచరిక వ్యవస్థలో పాలకులు, పాలితులుండేవారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలితులు పౌరులయ్యారు. రాజ్యంలో సభ్యత్వంకలిగి, చట్టపరమైన హక్కులు అనుభవిస్తూ.. బాధ్యతలు నిర్వహించే వ్యక్తులే పౌరులు. పౌరులకు రాజకీయ, పౌరహక్కులు లభిస్తే.. విదేశీయులకు ఈ విషయంలో పరిమితులున్నాయి. మన రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో సమానత్వ హక్కు (14వ ప్రకరణ), నేరం చేయందే శిక్షించకూడదనే హక్కు (20వ ప్రకరణ), ప్రాణరక్షణ హక్కు (21వ ప్రకరణ), పీడనను నిరోధించే హక్కు (23వ ప్రకరణ), మతస్వాతంత్ర్య హక్కు (25, 27, 28 ప్రకరణలు) పౌరులతో పాటు విదేశీయులకు కూడా లభిస్తాయి.

## విదేశీయులూ పౌరసత్వం పొందచ్చు:

15, 16, 19, 21ఎ, 30 ప్రకరణల్లో పొందుపరిచిన హక్కులు భారతీయ పౌరులకు మాత్రమే లభిస్తాయి. రాజ్యాంగంలోని 5-11 ప్రకరణలు పౌరసత్వాన్ని వివరిస్తాయి. భారత్ రిపబ్లిక్‌గా అవతరించిన 26.01.1950 నాటికి భారతదేశంలో స్థిరనివాసం ఏర్పరచుకొన్న వారందరికి భారతీయ పౌరసత్వం లభించింది. కొన్ని పరిమితులతో పాకిస్థాన్ నుంచి భారతదేశానికి శాశ్వత ప్రాతిపదికగా తరలివచ్చిన వారికి, ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు పౌరసత్వం లభించింది. విదేశీయులు రిజిస్ట్రేష న్

ద్వారా పౌరసత్వాన్ని పొందవచ్చు. వేరే భూభాగం భారత్‌లో విలీనమైనప్పుడు (సిక్కిం విలీనమైనపుడు అక్కడి ప్రజలకు భారత పౌరసత్వం లభించింది) ఆ ప్రజలకు భారత పౌరసత్వం లభిస్తుంది. భారత్‌లో పౌరసత్వం పుట్టుక లేదా రక్తసంబంధం ద్వారా లభిస్తుంది. పార్లమెంటుకు 11వ ప్రకరణ కింద పౌరసత్వానికి సంబంధించిన చట్టం చేసే అధికారం సంక్రమించింది. ఆ మేరకు 1955 పౌరసత్వ చట్టం అమల్లోకి వచ్చింది. 1986 సవరించిన నిబంధనల మేరకు.. 1950, జనవరి 26 నుంచి 1987, జూన్ 30 మధ్యకాలంలో భారతదేశంలో జన్మించిన వారికి(ఆ సమయంలో వారి తల్లిదండ్రులలో ఏ ఒక్కరైనా భారతీయ పౌరసత్వం కలిగి ఉంటేనే) పౌరసత్వం లభిస్తుంది.

## ద్వంద్వ పౌరసత్వం:

ఇటీవల కాలంలో లక్షలాది మంది భారతీయులు.. ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఇతర దేశాలకు వెళ్ళి స్థిరపడ్డారు. అయితే, వారు స్వదేశంతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని 2003లో పార్లమెంట్ ద్వంద్వ పౌరసత్వ చట్టాన్ని ఆమోదించింది. భారత్‌తో సత్సంబంధాలు కలిగి ఉన్న 16 దేశాలలో నివసించే భారతీయులకు ఈ అవకాశం కల్పించింది. దీన్ని 2006లో సవరించి, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో పౌరసత్వాన్ని కలిగిన భారతీయ సంతతి మినహా మిగిలిన దేశాలలో నివసించే భారతీయులందరికీ ఈ అవకాశాన్ని విస్తరించారు. దీని ప్రకారం పైన పేర్కొన్న నిబంధనల మేరకు ప్రవాస భారతీయులకు, తాము శాశ్వతంగా నివసిస్తున్న దేశపు పౌరసత్వంతో పాటు భారతదేశ పౌరసత్వం కూడా లభిస్తుంది. ఇది కొన్ని పరిమితులకు లోబడి వర్తిస్తుంది. తాము నివసిస్తున్న దేశ చట్టం, ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించాలి. వీరికి రాజ్యాంగంలోని 16వ ప్రకరణ కింద లభించే హక్కులు వర్తించవు. ప్రభుత్వ ఉద్యోగాలలో సమానవకాశాలుండవు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ఎంపీ, ఎంఎల్ఏ, ఎంఎల్‌సీ వంటి పదవులకు పోటీచేయటానికి, ఎన్నికలలో ఓటువేయటానికి అనర్హులు. అయితే, వీరు భారత్‌ను ఎన్నిసార్లయినా సందర్శించ వచ్చు, ఎంత కాలమైనా నివసించవచ్చు, ప్రభుత్వం కల్పించే ఆర్థిక, విద్యావకాశాలు వినియోగించుకోవచ్చు. కాకపోతే వ్యవసాయ సంబంధ (ప్లాంటేషన్) భూములను కొనుగోలు చేయరాదు. భారతదేశంలో ఒక సంవత్సరం పాటు నివసిస్తే పౌరసత్వానికి అర్హత పొందుతారు. పౌరసత్వాన్ని పరిత్యాగం (Renunciation), రిక్తపరచటం (deprivation), సమాపనం (termination) ద్వారా కోల్పోతారు. దేశద్రోహులకు పార్లమెంటు చట్టం ద్వారా పౌరసత్వ సమాపనం గావించవచ్చు. వేరే దేశ పౌరసత్వాన్ని పొంది స్వచ్ఛందంగా భారతదేశ పౌరసత్వాన్ని పరిత్యాగం చేయవచ్చు. ఇతర దేశ పౌరసత్వాన్ని కలిగి ఉన్నందున మనదేశం వారికి భారత పౌరసత్వాన్ని రిక్తపరచవచ్చు.

## ప్రాథమిక హక్కులు:

హక్కులు నిరపేక్షం కాదు; కొన్ని పరిమితులకులోనౌతాయి. గత 57 ఏళ్లలో జరిగిన రాజ్యాంగ

సవరణలు.. ఒకవైపు వీటిని పరిమితం చేస్తే, మరోవైపు సుప్రీంకోర్టు రాజ్యాంగ ప్రకరణలకు అర్థవివరణ ద్వారా వీటి పరిధిని విస్తృతం చేశాయి.ఒకటో రాజ్యాంగ సవరణ చట్టం (1951) ద్వారా చేర్చిన 31(ఎ) ప్రకరణ, 25వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 31(సి) ప్రకరణ 14, 19లలో పేర్కొన్న ప్రాథమిక హక్కులను పరిమితం చేశాయి. 31(ఎ) ప్రకరణ మేరకు భూ సంస్కరణలు అమలు చేయడానికి కొన్ని చట్టాలను చేశారు. అలానే 31(సి) ప్రకరణ ద్వారా ఆదేశసూత్రాలు అమలు చేయడానికి మరికొన్ని చట్టాల ను ఆమోదించారు.

ఈ చట్టాల వల్ల రాజ్యాంగంలో పేర్కొన్న 14వ ప్రకరణ (చట్టం ముందు అందరూ సమానులే), 19వ ప్రకరణ (వాక్‌స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం)లకు ఆటంకం ఏర్పడతుందని న్యాయస్థానాలు ప్రకటించకూడదు. అలాగే 1వ రాజ్యాంగసవరణ ద్వారా చేర్చిన 31(బి) ప్రకరణ దాదాపు అన్ని ప్రాథమికహక్కులకు పరిమితం చేసింది. ఈ ప్రకరణ ఆధారంగా రాజ్యాంగంలో 9వ షెడ్యూల్‌ను చేర్చారు. దీని ప్రకారం పార్లమెంటు, శాసనసభలు చేసిన ఏ చట్టాలైనా ఈ షెడ్యూల్‌లో చేర్చితే.... వాటిని ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయనే కారణంతో న్యాయస్థానాల్లో సవాలు చేయకూడదు. అయితే కేశవానంద భారతి కేసులో (1973) రాజ్యాంగ మౌలిక స్వభావానికి భంగం కలిగించే ఏ చట్టాన్ని అయినా న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చని సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పునిచ్చింది. 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చిన ప్రాథమికవిధులు (51(ఎ) ప్రకరణ) పరోక్షంగా ప్రాథమిక హక్కులను పరిమితం చేస్తాయి. ప్రాథమిక విధుల అమలుకు న్యాయస్థానాలు ఉత్తర్వులు (రిట్స్) జారీ చేయడానికి వీలులేదు. అయితే ప్రాథమిక విధులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన వ్యక్తుల పట్ల... ప్రాథమిక హక్కుల అమలుకు న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయడానికి నిరాకరించవచ్చు. విధులు పాటించని వారికి హక్కులను అమలుచేయాలని కోరే హక్కు లేదు అనేది దీని సారాంశం.

## ఆస్తి హక్కు తొలగింపు:

రాజ్యాంగం ప్రాథమిక హక్కులను ఏడు తరగతులుగా వర్గీకరించింది. ఆస్తి హక్కును 44వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించడంతో ప్రస్తుతం 6 ప్రాథమిక హక్కులు మాత్రమే ఉన్నాయి.

అవి...

1) కుల, మత, లింగ, జాతి ప్రాతిపదికగా ఎలాంటి వివక్ష చూపరాదు (15వ ప్రకరణ);

2) ప్రభుత్వ ఉద్యోగాల్లో అందరికీ సమానవకాశాలు (16వ ప్రకరణ);

3) వాక్, సమావేశ, సంఘాలుగా ఏర్పడే, సంచరించే, స్థిర నివాసమేర్పరచుకునే, ఇష్టం వచ్చిన వృత్తిని ఏర్పరచుకునే స్వాతంత్ర్యం (19వ ప్రకరణ); అల్పసంఖ్యాక వర్గాలకు సాంస్కృతిక, విద్యా హక్కు (30వ ప్రకరణ). కొన్ని రకాలైన హక్కులు భారతీయులతోపాటు విదేశీయులకు కూడా వర్తిస్తాయి. అవి...

1) చట్టం ముందు సమానత్వం, సమానంగా చట్టపరమైన రక్షణ (14వ ప్రకరణ)

2) కార్యానంతర (ex post facto) చట్ట ప్రాతిపదికగా శిక్ష విధించరాదు.

తనకు వ్యతిరేకంగా సాక్ష్యం పలకమని నిర్దేశించరాదు. ఒకే తప్పుకు రెండుసార్లు శిక్ష విధించకూడదు(20వ ప్రకరణ);

3) ప్రాణానికి, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ (21వ ప్రకరణ);

4) పీడనాన్ని నిరోధించే హక్కు (23వ ప్రకరణ);

5)మతస్వాతంత్ర్యపు హక్కు (25వ ప్రకరణ);

6) మత సంబంధిత కార్యకలాపాలకోసం పన్ను చెల్లించమని బలవంతం చేయరాదు (27వ ప్రకరణ)

7) ప్రభుత్వ నిర్వహణలోనున్న విద్యా సంస్థలలో మత బోధనలకు హాజరుకావాలని బలవంతం చేయరాదు (28వ ప్రకరణ)

## ప్రాథమిక హక్కులు..

రాజ్యంతో పాటు, వ్యక్తుల నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. అవి..ప్రభుత్వ ధన సహాయంతో నిర్వహించే బావులు, చెరువులు, స్నానశాలలు, రోడ్లు, మొదలైవి అందరికి లభించాలి (15(2) ప్రకరణ); అంటరానితనాన్ని నిషేధించడం (17వ ప్రకరణ); ఇతర దేశాలు ఇచ్చే బిరుదులు స్వీకరణపై నిషేధం (18(3)-(4) ప్రకరణ); బానిసత్వ నిషేధం (23వ ప్రకరణ); బాలకార్మిక వ్యవస్థ నిషేధం (24వ ప్రకరణ). అయితే ఈ ప్రకరణలను అమలు చేయాలంటే చట్టాలు చేయాలి!!